వాహనాల తనిఖీ.. రూ. 3,52,795 స్వాధీనం

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీల్లో పోలీసులు ఓ వ్యక్తి వద్ద రూ. 3,52,795 స్వాధీనం చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం అచ్చయ్యనగర్ వద్ద చిక్కడపల్లి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కిషోర్‌కుమార్ అనే వ్యక్తి వాహనంలో నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు చూపించకపోవడంతో రిటర్నింగ్ అధికారికి అందజేశామని ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపారు.


ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న జేఎల్ఎమ్ అభ్యర్థులు

న్యాయం చేయండి : జేఎల్ఎమ్ అభ్యర్థులు

కవాడిగూడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలంటూ జూనియర్ లైన్‌మెన్ అభ్యర్థులు గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. జానీ, ఆర్. హుస్సేన్, రమేష్, ప్రేమ్, బాలరాజు మాట్లాడుతూ.. జేఎల్ఎమ్ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జేఎల్ఎమ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 650 మంది అభ్యర్థులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాలో జేఎల్ఎమ్ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవింద్ నరేష్

మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించని

కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం

ముషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కూడా కేటాయించని కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ అన్నారు. గురువారం ముషీరాబాద్ మోహన్‌నగర్ కమ్యూనిటీహాలులో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెడ్డి కులస్థులకే పదవుల కేటాయింపులో న్యాయం చేస్తున్నారని, బడుగు, బలహీన వర్గాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ పోరాటానికి కిషన్‌రెడ్డి మద్దతు ఇస్తున్నందున ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు విజయరావు, కృష్ణ, ఎల్లయ్య, మల్లికార్జున్, సుజాత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న వై. శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఐదేళ్లలో ముషీరాబాద్‌లో చేసిన అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలను మభ్య పెట్టేందుకు కిషన్‌రెడ్డి ప్రజా నివేదిక పేరిట మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిధులను ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. పేదలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నెల రోజులుగా కార్పొరేట్ సంస్థల నిధులతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు తప్ప ప్రజలకు చేసిందేమీలేదని ధ్వజమెత్తారు. సమావేశంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి, భోలక్‌పూర్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, నాయకులు రహీం, మహ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

'రామాయణానికి రాముడే కథానాయకుడు'

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రామాయణానికి రాముడే కథానాయకుడని, అతనే ధర్మనేత అని వేద ప్రచారకులు మర్రి కృష్ణారెడ్డి అన్నారు. గీతా ఫౌండేషన్, గో ప్రచారక సేవాసమితి, కుసుమ ధర్మన్నగారి కళాపీఠం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా గురువారం రాత్రి త్యాగరాయగానసభలో శ్రీరామ వైభవం అంశంపై ప్రసంగం, కవిసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు మర్రి కృష్ణారెడ్డిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. రామాయణం రాముని జీవనప్రయాణమేనన్నారు. రామాయణంలో అడుగడుగునా వైదిక జీవన విధానం కనబడుతుందన్నారు. సీతారాముల వైదికాదర్శ స్ఫూర్తి మన గుండెల్లో గుబాళించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బడేసాబ్, ప్రముఖ కవి, విమర్శకులు రామకృష్ణచంద్రమౌళి, గంటా మనోహర్‌రెడ్డి, కరుణాకర్ గుప్తా, దామోదర్‌రావు, చంద్రప్రకాశ్‌రెడ్డి, అంజనీకుమారి, సరోజినీదేవి, దేవేందర్‌గుప్తా పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్థులు ఏకమై హక్కులు సాధించుకోవాలి


కమిటీ నేతలకు నియామకపత్రం అందజేస్తున్న బండా ప్రకాష్

నల్లకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్థులందరూ ఏకమై హక్కులు సాధించుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం హైదర్‌గూడలో మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ముదిరాజ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మత్స్య పారిశ్రామిక సంఘాలను బలోపేతం చేసుకుని కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికాంత్, మహాసభ యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పండుగ బాబు, సతీష్, నాయకులు మేక రవీందర్ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లెబోయిన అశోక్, వరలక్ష్మి, నీల రాములు, సత్తయ్య, యాదగిరి, డాక్టర్ బోళ్ల వెంకట్ పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం


నవీన

కవాడిగూడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ, ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లిన యువతి కనిపించకుండాపోయారు. బండైసమ్మనగర్‌లో నివసిస్తున్న ఎం. నవీన(28) ఇందిరాపార్కు సమీపంలో ఓ ఇంట్లో పనిచేస్తోంది. ఈనెల 10వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త శ్రావణ్‌కుమార్ గురువారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లిన యువతి..


మేఘన

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఆజంపురలో నివసిస్తున్న నాగేశ్వర్‌రావు కుమార్తె ఎన్. మేఘన(24) అనారోగ్యం బారిన పడడంతో గురువారం చప్పల్‌బజార్‌లో ఎస్వీఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వాష్‌రూమ్‌కు వెళ్లిన మేఘన తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో నాగేశ్వర్‌రావు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాద చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రాంనగర్ రామాలయంలో జరిగిన శ్రీరాముడి చక్రస్నానంలో పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు

రాంనగర్ రామాలయంలో

శ్రీరాముడికి చక్రస్నానం

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సీతారాముల పట్టాభిషేకం, స్వామివారికి చక్రస్నాన కార్యక్రమాలు రాంనగర్ రామాలయంలో గురువారం నిర్వహించారు. ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ డి. రవియాదవ్, ధర్మకర్తలు ఆనంద్ ముదిరాజ్, గోవర్ధన్‌రెడ్డి, ఆకారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తలంబ్రాలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరామ పట్టాభిషేకం కనులపండువగా నిర్వహించారు. అంతకుముందు మంత్రపుష్పము, తీర్థప్రసాద కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈవో దేవనాథం, ముఖ్యఅర్చకుడు బుగ్గా లక్ష్మీపతిశర్మ ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో లక్ష్మీగణపతి దేవాలయంలో శ్రీరామపట్టాభిషేకం కార్యక్రమాన్ని ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.


పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

జనగణనలో కులగణన చేపట్టాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని, చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ రమేష్ అధ్యక్షతన బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, రైల్వే, ఎల్ఐసీ, బీహెచ్ఈఎల్, బీడీఎల్, బ్యాంకింగ్, రక్షణ తదితర ప్రభుత్వరంగ సంస్థలను ప్రవేటుపరం చేయొద్దని అన్ని ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. కేంద్రం స్పందించకపోతే జూన్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ బీసీ కులగణన, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెడతామని ప్రకటిస్తుందో ఆ పార్టీకే బీసీలు మద్దతు ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సంఘం నేతలు నీల వెంకటేష్, నందగోపాల్, వేముల రామకృష్ణ, రేగుల మధుసూదన్, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.


ర్యాగ రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా రమేష్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ర్యాగ రమేష్ నియమితులయ్యారు. గురువారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆయనకు నియామకపత్రం అందజేశారు.


శివపార్వతుల కల్యాణంలో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తదితరులు

రాజేశ్వరి ఆలయంలో శివపార్వతుల లీలా కల్యాణం

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బాపూనగర్ రాజరాజేశ్వరి దేవాలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శివపార్వతుల లీలా కల్యాణం, జయాది హోమం, మహాపూర్ణాహుతి, మహేశ్వర ఘణ ఆశీర్వచనం, కల్యాణ శివపార్వతుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు, వీరపురంతులచే నందికోల సేవ నిర్వహించారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ దంపతులు, బీజేపీనేతలు దామోదర్, రాజేందర్, భక్తులు ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. కల్యాణం సందర్భంగా దత్తకార్తికేయ దేవరస్వామి అనుగ్రహభాషణం చేశారు.

ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు ఏఎస్ రావు టెలీఫిలిం విడుదల

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దాశరథి ఫిలిం సొసైటీ సమర్పణలో డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక నిర్వహణలో ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు ఏఎస్ రావు టెలీఫిలింను గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఎస్. వినయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్. ఏఎస్ రావు అణు రియాక్టర్ అప్సర నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. మొట్టమొదట దేశీయ టీవీ, కంప్యూటర్, యాంటీనాలు, రక్షణ రంగానికి కావాల్సిన ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ రూపొందించడంలో కృషి చేశారని పేర్కొన్నారు.

సౌదీలో కూల్చివేసిన సమాధులను నిర్మించాలని ధర్నా

కవాడిగూడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియా మదినే మునవర్‌లో ధ్వంసం చేసిన మహ్మద్ ప్రవక్త కుటుంబీకులు, కుమార్తె హజ్రత్ బీబీఫాతిమా సమాధులను తక్షణమే పునర్ నిర్మించాలని ఆల్‌బకీ ఆర్గనైజేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. 1924లో అప్పటి ప్రభుత్వం ఈ సమాధులను కూల్చివేసిందని, పునరుద్ధరించాలని శతాబ్దకాలంగా ఎన్నో సంస్థలు పోరాటం చేస్తున్నాయని అన్నారు. సమాధులను పునర్‌నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఆల్ బకీ హైదరాబాద్ చాప్టర్ సంస్థ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. భారత ప్రభుత్వం సౌదీ అరేబియాతో చర్చించి సమాధులను పునర్‌నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రపంచ వ్యాప్తంగా పలు సంస్థలు దీనిపై ఆందోళనలు చేస్తున్నా సౌదీ అరేబియా ప్రభుత్వం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ధర్నాలో ఆల్ బకీ సంస్థ ప్రతినిధులు డాక్టర్ షఫీక్‌బాదర్, మౌలానా ఫయాజ్, మౌలానా హైదర్ జహేదా, మౌలానా అన్నాస్ రజ్వీ, ఫిరాసత్ అలీ బాక్రి, సయ్యద్ అలీ హుస్సేన్ జహేదీ, మీర్ సోహెల్ రజాక్, ముస్తఫా సాదిక్, జావెద్ హకీంబేగ్, పలు సంస్థల ప్రతినిధులు మౌలానా అన్నన్, మౌలానా జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

సివిల్స్‌లో రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీకి

23 ఆలిండియా ర్యాంకులు


నాగభరత్‌ను అభినందిస్తున్న వివేకానంద, శ్రీరామ్ ముప్పాళ్ళ

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2023 ఫలితాల్లో అశోక్‌నగర్‌లోని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు 23కి పైగా ఆలిండియా ర్యాంకులు సాధించారు. 2021 ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు, 2022 ఫలితాల్లో 15 మంది, 2023 ఫలితాల్లో 23 కిపైగా మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని అకాడమీ డైరెక్టర్ డా. గడియారం వివేకానంద, శ్రీరామ్ ముప్పాళ్ల, సీఎల్ఎన్ ధవేజీ అన్నారు. రిఫ్లెక్షన్స్ అకాడమీ నుంచి అనన్యరెడ్డి(3వ ఆలిండియా ర్యాంకు), సాయికిరణ్(27), టెంజో ఏ జోస్(59), రావుల జయసింహ(104), అశ్విన్ మణిదీప్ కాకుమాను(148), సుశీల్ శ్రీకృష్ణ(155), వినీత్ లోహిదక్షణ్(169), పెంకేసు ధీరజ్‌రెడ్డి(173), సహరిత(217), బన్న వెంకటేష్(467), కె. శ్రీనివాసులు(526), కొయ్యడ ప్రణయ్ కుమార్(554), మర్రిపాటి నాగభరత్(580), రెడ్డి భార్గవ్(590), కె. అర్పిత(639), చౌహాన్‌రాజ్‌కుమార్(703), గాదె శ్వేత(711), కొలనుపాక సహన(739), సందీప్‌కుమార్(830), శశికాంత్(891), అనుప్రియ నినావత్(914), రావూరి సాయి అలేఖ్య(938), శ్వేత(985)తో కలిపి మొత్తంగా 23 మంది ర్యాంకులు సాధించారు. 2030 నాటికి 100 మంది ఐఏఎస్, 100 మంది ఐపీఎస్‌లను దేశానికి అందించడమే అకాడమీ లక్ష్యంగా పెట్టుకుందని వివేకానంద తెలిపారు.



మాట్లాడుతున్న పీవైఎల్ నేతలు

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ టికెట్ల అమ్మకాల్లో అక్రమాలు

● విచారణ జరిపించాలి : పీవైఎల్

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ టికెట్లను బ్లాక్‌లో అమ్ముకుంటున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ యాజమాన్యాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్. ప్రదీప్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె. ధరేంద్ర, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు.

గురువారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జరిగిన యువజన సమావేశంలో వారు మాట్లాడారు. ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్ల విక్రయాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. టికెట్లను హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ యాజమాన్యాలు బ్లాక్‌లో విక్రయిస్తున్నాయని ధ్వజమెత్తారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, భూషణవేణి కృష్ణ, బంగారి శ్రీనివాస్, కొల్లూరు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో

విద్యార్థులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై దాడి చేసిన ఏబీవీపీ నేతలను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. ఎల్. మూర్తి డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడిని నిరసిస్తూ గురువారం నారాయణగూడ ఫ్లైఓవర్ కింద ఏబీవీపీ దిష్టిబొమ్మను ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులపై ఏబీవీపీ గూండాలు కత్తులతో దాడి చేశారని, అమ్మాయిలను సైతం జుట్టుపట్టుకుని ఈడ్చారని, అంబులెన్స్‌ను కూడా అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించి దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు


మధుజ్యోతికి ఉగాది పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

ద్రవిడ వర్సిటీ వీసీకి ఉగాది పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ద్రవిడ విశ్వవిద్యాలయానికి కొలకలూరి మధు జ్యోతి వీసీగా నియమితులవడం ఆమె ప్రతిభకు తార్కాణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం క్రోధి నామ ఉగాది పురస్కారాన్ని ఆచార్య కొలకలూరి మధుజ్యోతికి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధుజ్యోతి ఉత్తమ అధ్యాపకురాలు అని అన్నారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. ఆమె ప్రత్యేక సాహితీ వ్యక్తిత్వం కలవారని, ఇందుకు మధుజ్యోతి రచనలే ఉదాహరణ అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ప్రతియేటా గానసభ ప్రదానం చేస్తున్న ఉగాది పురస్కారానికి ప్రత్యేకత ఉందని, ప్రతిభావంతులు ఎందరో ఉన్నా వారిలో ఒక్కరిని ఎంపికచేసి ఇస్తున్నామని తెలిపారు.

21న ఏవీ సావిత్రి లలితసంగీత పోటీల రజతోత్సవం

చిక్కడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో అలనాటి ప్రముఖ గాయని, ఆకాశవాణి కళాకారిణి ఏవీ సావిత్రి లలిత సంగీత పోటీల రజతోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 21న త్యాగరాయగానసభలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల తెలిపారు. ఈ సందర్భంగా నృత్యనాటిక ప్రదర్శన, లలితసంగీత విభావరి జరుగుతుందన్నారు. లలితసంగీత పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమ వివరాల పోస్టర్‌ను గురువారం చిక్కడపల్లిలో సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. నృత్యకళాకారులు మధుమతి, కులకర్ణి, స్నేహరామ్‌చందర్, లక్ష్మీమానస, కోశాధికారి హరినాథ్‌బాబు పాల్గొన్నారు.


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

పెరియ పురాణం గ్రంథావిష్కరణ

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్, నృత్య కిన్నెర సంస్థల సంయుక్తాధ్వర్యంలో గురువారం నల్లకుంట శృంగేరి శంకరమఠంలో ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ మద్దాళి సుబ్బారావు రచించిన పెరియ పురాణం 6వ ముద్రణ గ్రంథావిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథిగా ఐఏఎస్ విశ్రాంత అధికారి డాక్టర్ కేవీ రమణాచారి, అనుమండ్ల భూమయ్య, రాయసం వెంకట్రామయ్య, ఆచార్య ముదిగొండ శివప్రసాద్, డాక్టర్. ఓలేటి పార్వతీశం, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు సిస్టర్స్ గౌరి హస్విక, లక్ష్మి సాత్విక భక్తిగీతాలాపన హృద్యంగా సాగింది.

'కల్లుగీత సొసైటీలపై నిర్బంధాన్ని ఎత్తివేయాలి'

రాంనగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత సొసైటీలపై నిర్బంధాన్ని ఎత్తివేయాలని తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు.

గురువారం చిక్కడపల్లిలో సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కల్లుగీత సొసైటీలపై ఎన్నడూ లేని విధంగా పోలీసులు, రెవెన్యూ, ఎన్‌సీబీ బృందాలు దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేశాయని, అనేకమందిపై నాన్‌బెయిలబుల్ కేసు పెట్టారన్నారు. కల్లుగీతను పర్యవేక్షించే అబ్కారీ శాఖకు సంబంధం లేకుండా దాడులు చేయడాన్ని వారు ప్రశ్నించారు. గీతకార్మికులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న గౌడలకు ఒక్క ఎంపీ సీటు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. చెట్లపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, వైన్స్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ గౌడలకు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పాతగాని ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రేష్మ బంగారు పతకానికి ఎంపికవడం అభినందనీయం

ఈఎన్‌టీ డాక్టర్ బహునూతల రేష్మ జాతీయ స్థాయిలో బంగారు పతకానికి ఎంపిక కావడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం ఆమెను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జైస్వాల్ గార్డెన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, చైర్మన్ ఎ. రామాగౌడ్, కార్యదర్శులు కె. సత్యనారాయణ, రోలా లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు. - గోల్నాక, ఆంధ్రజ్యోతి



వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

అంబర్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో క్యాబ్ డ్రైవర్, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఎలక్ట్రీషియన్ బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. చెన్నారెడ్డినగర్‌లో నివసిస్తున్న ఖాజామీయా కుమారుడు మన్సూర్ అహ్మద్ (29) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో అప్పులు చేశాడు. తీర్చలేక కొంతకాలంగా ఆందోళన చెందుతున్నాడు. గురువారం ఇంట్లో చున్నీతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో..

బర్కత్‌పుర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిపల్లి వద్ద నివసిస్తున్న సయ్యద్ నహీమ్(28) ఎలక్ట్రీషియన్. రెండేళ్ల క్రితం నేహా ఫాతిమాతో అతడికి వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన నహీమ్ గురువారం వట్టిపల్లి రైల్వే గేట్ వద్ద ఎంఎంటీఎస్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. 'తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, ఎవరిపైనా కేసు పెట్టవద్దని, జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నానని' సెల్‌ఫోన్‌లో వీడియో రికార్డు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.